# మళ్ళీవస్తాలేరా... కన్నా!

సారథి ఉబ్బితబ్బిబ్బులవుతున్నాడు.

అవును. అమ్మ వచ్చింది. కాపురం పెట్టాక రావడం ఇదే ప్రథమం. రమ్మనమని ఉత్తరాలు రాసినా వస్తాలే, వస్తాలే అంటూనే జవాబులు రాయించింది. ఊళ్లో అన్నయ్య దగ్గరే ఉంటోంది. ఇంటికి తాను తిరిగి రావడం కొంచెం ఆలస్యమైతే బాధపడే అమ్మ ఇన్ని నెలలు తనను చూడకుండా ఎలా ఉండగలిగింది? తననీ, శ్యామలనీ చూడాలనే కోరిక ఆమె చూపులలో గూడుకట్టుకుంది. వచ్చీరాగానే ఆ కళ్లు చెప్పాయి. ఆ కోరికను తన రెప్పలకింద ఎలా దాచుకోగలిగిందో! మమకారం పెట్టే వేదనల్ని ఆ గుండె ఎలా భరించగలిగిందో! "కన్నా!" అని కమ్మని పిలుపు మళ్లీ వినిపించింది. తాను బ్రహ్మచారిగా ఉన్నప్పుడు ఈ పట్నంలో ఒక గది, దాన్ని ఆనుకుని వంటకు చిన్న గది. అందులోనే తనకెలాంటి లోటూ రాకుండా సర్దుబాటు చేస్తూ కాలక్షేపం చేసింది. అమ్మ శరీరానికి విశ్రాంతి లేదు. పనికి విరామం లేదు. ఆఫీసుకు ఎక్కడ ఆలస్యమవుతుందోనని తెల్లవారకముందే లేచి, స్నానం చేసి, కుళాయి నీళ్లకోసం పోటీపడి తాను లేచేసరికి కాఫీ సిద్ధం చేసేది. తన మంచం ఎదురుగా ఏడుకొండలవాడి ఫోటో పెట్టేది. ఆ స్వామిని ముందు చూడాలనీ, అది శుభప్రదమనీ అమ్మ నమ్మకం. 'అలా ఎందుకనుకుంటావమ్మా?' అని ఎన్నిసార్లు చెప్పినా ఆ అలవాటు మానేది కాదు. నిజానికి ఏ దైవమైనా అమ్మ తర్వాతనే!

అమ్మ చేతివంట అమృతం. ఎక్కడ రుచి తగ్గుతుందో, ఎక్కడ ఉప్పో కారమో ఎక్కువవుతుందో అని విలవిలలాడిపోయేది. దగ్గర కూర్చుని వడ్డిస్తుంటే ప్రతి క్షణం ఆమె కళ్లల్లో తొణికిసలాడే ఆనందం మాటలకందదు. తాను నిద్రపోయేవరకూ మెలకువతోనే ఉండేది. కంటికి రెప్పకంటే ఎక్కువగా చూసుకునేది.

తల్లిదండ్రులకెందుకో పిల్లల మీద ఇంత అనురాగం? స్వానుభవం ఒక్కటే దీనికి సమాధానం చెప్పగలుగుతుందేమో! మరోవిధంగా ఆ మనోభావాన్ని వివరించడం సాధ్యం కాకపోవచ్చు. తండ్రి ఎవరిచేతా పరిచర్యలు చేయించుకోకుండా ఆకస్మికంగా కన్నుమూశాడు. అమ్మే అన్నీ తానై పెద్దచేసింది. ఇప్పుడు తనను ఒక ఇంటివాణ్ణిగా కూడా చేసింది.

అలాంటి అమ్మ వచ్చింది. ఊరునుంచి సున్నుండలు, మంచి నెయ్యి తెచ్చింది. సారథి చిన్నపిల్లవాడిలా మారి, అమ్మ ఒళ్లో తల పెట్టుకుని లోకాన్నే మరిచిపోవాలను

కున్నాడు. కానీ ఎలా సాధ్యం? పిల్లవాడిలా మారలేదు. కానీ, చల్లని అమ్మఒడిలో సేద తీర్చుకోవచ్చు.

అమ్మ వంట తినాలి.... అమ్మ వడ్డిస్తుంటే ఆమె కళ్లల్లో నడయాడే తృప్తిని చూడాలి.... ఇలా ఎన్నెన్నో కోరికలు ఉబికివస్తున్నాయి.

ఆఫీసు నుంచి ఎంత త్వరగా బయలుదేరాలని ప్రయత్నించినా పని తెమల్లేదు. పైగా, డైరెక్టరు మీటింగుకు వెళ్తూ అర్జంటు ఇన్‌ఫర్మేషన్ ఏదైనా కావాల్సివస్తే ఇవ్వడంకోసం ఉండమన్నాడు. ఆయన మీటింగునుంచి తిరిగివచ్చేటప్పటికి ఎనిమిది దాటింది.

అమ్మకు ఇష్టమైనదేదైనా తీసుకువెళ్లాలనుకున్నాడు. కానీ నాన్న పోయాక అమ్మ వైరాగ్యంతోనే రోజులు గడుపుతోంది.

ప్రత్యేకంగా ఇష్టాలంటూ ఉన్నట్లు గుర్తించే అవకాశం చిక్కలేదు. అయినా మంచిరకం చిన్నద్రాక్ష కొన్నాడు.

పొద్దున్న అమ్మతో తీరుబడిగా మాట్లాడే టైము దొరకలేదు. శ్యామల ఎంత వద్దన్నా పొద్దున్న అమ్మే వంట చేసింది. చిన్నపిల్ల మడీ బాదరబందీ పడలేదని సర్దిచెప్పింది.

అమ్మ రాత్రిపూట భోజనం చేయదు. ఏదో ఒక పండు తినో, కొంచెం పాలు తాగో సరిపెట్టుకుంటుంది.

సారథి గబగబా వచ్చి "అమ్మా! అమ్మా!" అని పిలుస్తూ వీధి తలుపు తట్టాడు.

"శ్యామా! శ్యామా!" అనే పిలుపు ఆ చుట్టుపట్ల అందరికీ సుపరిచితం. వారంతా ఆశ్చర్యపోయారు.

సారథి పిలుపులో తేనె జల్లులు కురిశాయి. శ్యామల వచ్చి తలుపు తీసింది. లోపల అడుగుపెడుతూనే సారథి కళ్లు అమ్మకోసం వెతికాయి. శ్యామల గ్రహించింది. "అత్తయ్య ఇప్పుడే పడుకున్నారు!"

పక్కగదిలో చాపమీద పడుకున్న తల్లి కనిపించింది.

"అదేంటమ్మా, కింద పడుకున్నావు? శ్యామా! అమ్మకి మంచం వేయలేదే!"

శ్యామల జవాబివ్వడానికి ముందే, "ఏరా కన్నా! మీ నాన్న పోయాక నేనెప్పుడైనా మంచం మీద పడుకున్నానురా? అమ్మాయి మంచం వేస్తానంటే నేనే వద్దన్నా!" అంటూ తల్లి లేచి కూర్చుంది.

"ఇవుగోనమ్మా ద్రాక్షపళ్లు. ఇక్కడ చాలా ప్రసిద్ధి. బావుంటాయి. ఇంకా ముందుగా వద్దామనుకున్నా. ఆఫీసులో లేటయింది. ఫలహారం అయిందా అమ్మా?" సారథి తల్లిపక్కనే కూర్చున్నాడు.

"కన్నా! స్నానం చేసి, భోజనం కానీ, తర్వాత మాట్లాడకుందాం!"

"అయితే, నువ్వు లేచి వడ్డించమ్మా!" ఆ మాటల్లో గారాబం ఉంది. గుండెల్లో దాగిన పసిపిల్లవాడి కోరిక ఉంది. గతంలోకి వెళ్లిపోవాలనే తపన ఉంది.

ఆ సంగతి తల్లి గ్రహించలేకపోలేదు. "స్నానం కానీయ్!" అని మళ్ళీ బుజ్జగింపుగా చెప్పింది.

"అమ్మాయ్, శ్యామలా! మీ ఇద్దరూ వడ్డించుకుని భోజనం చేయండమ్మా!"

"అదికాదత్తయ్యా! మీ అబ్బాయి మిమ్మల్ని వడ్డించమంటున్నారుగా!" కొంచెం బెరుకుగా అంది.

"వాడు అలాగే అంటాడమ్మా!... నువ్వు వడ్డన మొదలెట్టు!" నచ్చచెప్పింది.

సారథి భోజనానికి వచ్చాడు. శ్యామల వడ్డిస్తూండటం గమనించాడు. డైనింగ్ టేబుల్‌వైపు వస్తున్న తల్లివైపు అలిగినట్లు చూస్తూ, "ఏంటమ్మా, నిన్ను వడ్డించమన్నాగా?" అంటూ దీర్ఘాలు తీశాడు.

తల్లి చిరునవ్వు నవ్వి తలూపింది.

"అది అంతేరా, కన్నా! ఇది చూసేందుకే నేను వచ్చాను! అమ్మాయి శ్యామల వడ్డన చూడాలని నా కోరికరా!"

సారథికి దీని భావం అర్థం కాలేదు. సారథి, శ్యామల భోజనం చేస్తుంటే కబుర్లు, జ్ఞాపకాలు అలలై పొంగులెత్తాయి. ఊళ్లో ఉన్న కొద్దిపాటి పొలం సేద్యంచేస్తూ తాతలనాటి ఇంట్లో తృప్తిగా జీవితం గడుపుతున్న అన్న, ఆత్మీయత పంచే వదిన, వారిద్దరి పిల్లలు... ఈ ఇద్దరిలో పెద్దదైన అవిటిపిల్ల, ఇరుగుపొరుగువాళ్లు, ఊళ్లో జనం, బంధువుల క్షేమసమాచారాలు ముచ్చటించుకున్నారు. శ్యామల పుట్టింటివారి సంగతులు గురించి మాట్లాడుకున్నారు.

శ్యామల ఎంతో ఆనందించింది.

సారథి చిన్ననాటి అలవాట్లు, చేష్టలు, అన్నీ తెలుసుకునే అవకాశం కలిగినందుకు శ్యామలకు సంతోషంగా ఉంది.

శ్యామలలో బెరుకు పూర్తిగా పోయింది.

సారథి కాపురం పెట్టిన తర్వాత ఆ విశేషాలు వింటున్న తల్లి హృదయం ఆనంద తరంగితమయింది.

రాత్రి భోజనం చేసిన తర్వాత కాసేపు పచార్లు చేయడం సారథికి అలవాటు. అందుకోసం బయటకు వెళ్లాడు.

శ్యామల కంచాలు తీసి వంటిల్లు సర్దుతోంది.

"అమ్మాయ్! నాకిప్పుడు చెప్పలేని సంతోషంగా ఉంది, తల్లీ! మనస్సు హాయిగా ఉంది. గుండెనిండా తృప్తి. పనులన్నీ ఎంత చక్కగా చేస్తున్నావమ్మా! ఇవన్నీ ఎప్పుడు నేర్చుకున్నావు?"

"మీరింత మెచ్చుకుంటున్నారు గానీ, మీ అబ్బాయి ఇంకా బాగా నేర్చుకోవాలంటారు!"

"వాడి మొహంలే తల్లీ! అమ్మమీద వాడికి అంతులేని అభిమానం."

"అది నిజమే, అత్తయ్యా! ఎప్పుడూ అంటూంటారు... అమ్మని మనతో ఉంచుకుందామని. అలా ఉత్తరాలు రాశారు కూడా, అత్తయ్యా!"

"అవునమ్మా! మీరు కాపురం పెట్టేవరకు ఈ పాతికేళ్ళుగా వాణ్ణి నేను ఎప్పుడూ వదిలి ఉండలేదు. పైగా, కన్నాని మరీ గారాబంతో పెంచాం!" కంఠం రుద్ధమయింది. ఒక్క క్షణం ఆగింది. "ఇక కన్నా భారం నీదేనమ్మా! ఇప్పటిదాకా ఏదో నా శక్తికొలది చేశాను. ఇకముందు నూరేళ్లూ కలిసి ఇద్దరూ ఒక్కరై సంతోషంగా ముందుకు సాగాలి తల్లీ! నువ్వు చదువుకున్నదానివి.... నా కన్నాను నీకు అప్పగిస్తున్నానమ్మా!"

"అదేంటత్తయ్యా.... అలా అంటారు! మీరంతా ఉండగా నాకు అప్పగిస్తామంటున్నారు. నేను చిన్నదాన్ని. ఏమీ తెలియదు..."

"అది అంతే తల్లీ! నీకు అప్పగించడంకోసమే ప్రత్యేకంగా ఇప్పుడు వచ్చానమ్మా. మీ పెళ్లయ్యాక, కాపురం పెట్టాక స్వేచ్ఛగా ఒకరినొకరు అర్థం చేసుకున్నాక నా బరువు బాధ్యతలు చాలావరకు తీరినట్లే తల్లీ! మరోమాట... చిన్నదానినన్నావు... నిజమే, అయితే పెళ్లి అయిన తర్వాత వయస్సుతో నిమిత్తం లేకుండా ఆడపిల్లకు భగవంతుడు ఊహకందనంత తెలివితేటలు, మమతానురాగాలు, బాధ్యతలభారాలు ఇస్తాడు. ఇప్పుడు నా కన్నాకు సర్వస్వం నువ్వేనమ్మా!"

"అత్తయ్యా! మీ మనస్సు ఎంత గొప్పదో!"

"అదేం కాదమ్మా! నా ఆలోచన వింతగా తోచవచ్చు. కానీ అదే శాంతినిస్తుంది. పెళ్లి చివర అప్పగింతల్లో పెళ్లికూతురు చేతులు పాలలో అద్ది మగపెళ్లివారిలో ముఖ్యులకు అప్పగిస్తారు. నా కనిపించింది తల్లీ, మీ పెళ్లిలో..."

"ఏమని అత్తయ్యా?"

"మా కన్నా చేతులు పాలలో అద్ది నీకు అప్పగించాలని!" ఆ తల్లి గొంతులోనుంచి కాసేపు మాటలు రాలేదు. "ఇప్పుడు నా గుండెలనిండా ఉన్న వాత్సల్యంలో అద్ది నీకు అప్పగిస్తున్నాను. నూరేళ్లు ఆనందంగా ఉండండి తల్లీ! నువ్వు అలాగే అను తల్లీ, నాకు కొండంత తృప్తి ఉంటుంది!"

"అలాగే, అత్తయ్యా! మీరూ ఇక మాతోనే ఉండండి!"

లోపలికి వస్తున్న సారథి "ఏంటమ్మా, కొండంత తృప్తి అంటున్నావు, శ్యామేమో అలాగే అంటోంది.... సరేగానీ, అమ్మా! నువ్విక మాతోనే ఉండాలి. వచ్చేయమని ఉత్తరాలు... అన్ని ఉత్తరాలు రాస్తే ఇప్పుడా రావడం?" బుంగమూతి పెట్టాడు.

"ఇప్పుడొచ్చాగా!"

"నిన్ను చూడాలని ఉండదా అమ్మా, నిన్ను విడిచి ఎప్పుడన్నా ఇంతకాలం ఉన్నానా, అమ్మా?" కట్టలు తెంచుకొచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమన్నాడు.

శ్యామల కళ్లు చెమర్చాయి.

తల్లి కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది.

కొడుకుని పొదివి పట్టుకుంది. "కన్నా! నీ మనస్సు నాకు తెలియదా! నీ అమ్మ మనసు నీకు తెలుసు. నిన్ను చూడాలని అనుక్షణం తపించానురా! కానీ రాలేదు. ఎందుకో తెలుసా?"

సారథి అడిగాడు: "ఎందుకు రాలేదు మరి?"

"చెబుతారా కన్నా! శ్యామల పనులు చూశా. అమ్మాయి నా కోడలుగా రావడం నా అదృష్టం, నా పుణ్యంరా! మీరిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుని అన్యోన్యతను పెంచుకునేందుకు కొన్నిరోజులు పడుతుంది. అందుకే నేను ఆ సమయంలో రాలేదు. ఇతరుల ప్రమేయం ఉండకూడదు. ఈ సమయంలో నాటుకున్న మొక్క ప్రేమవృక్షంలా వర్ధిల్లుతుంది!"

"అమ్మా! నాకేమీ అర్థం కావడంలేదు. అదంతా ఎందుకు? నువ్వు మాతోనే ఉండాలి, సరేనా?"

"కన్నా! నే నిప్పుడొక పనిమీద వచ్చారా!"

"ఏమిటా పని?"

"నిన్ను శ్యామలకు అప్పగించడం!"

సారథి విస్తుపోయి చూశాడు. "నేనేం పసివాణ్ణి కాదమ్మా!"

"తల్లి దృష్టిలో ప్రతిబిడ్డా పసివాడే! వాడి ఆలనా పాలనా చూసే వాళ్లున్నారనే గట్టి నమ్మకం ఉంటే ఆ తల్లి నిబ్బరంగా ఉంటుంది. తల్లి తర్వాత అలా చూడగలిగేది భార్య మాత్రమే. పైగా, తల్లి కొంతకాలమే చేయగలుగుతుంది.... కోడలు వచ్చేవరకూ. ఆ తర్వాత ఆ బాధ్యత కోడలికి అప్పగించాలి. ఇప్పుడా పని చేసేశాను. నిన్ను శ్యామలకి అప్పగించాను. నేనింక నిశ్చింతగా ఉంటాను.!"

"మీరిద్దరేం మాట్లాడుకున్నారో నాకు తెలియదు, నేనడిగినదానికి నువ్వు జవాబు చెప్పలేదు. మాతో ఉండమ్మా!"

"మీ నాన్న మసిలిన ఆ ఇంట్లోనే మిగిలిన కాలం గడపాలని ఉందిరా! పెద్దకొడుకు దగ్గరే సాయంసంధ్యలో ఉండటం ధర్మం కదరా కన్నా! ఆ ఇల్లు, ఆ ఊరు, ఆ పొలం చూస్తూ మీ అందరి తియ్యటి తలపులతో శేషజీవితం గడుపుతారా!"

"అలా మాట్లాడొద్దమ్మా! నేను తట్టుకోలేను."

"ఎలారా, దీనికే బెంబేలుపడిపోతే?"

"ఇప్పుడవన్నీ ఎందుకు? కనీసం ఇప్పుడు రెండు నెలలైనా మాతో ఉండాలమ్మా! రేపే అన్నయ్యకి ఉత్తరం రాస్తా - సరేనా?"

"కన్నా! నీకు తెలుసు కదరా, అక్కడ అన్నయ్య పొలం పనుల్లో తీరుబడి

లేకుండా ఉంటాడని. రెండు రోజుల్లో వచ్చేస్తానని చెప్పి వచ్చా. అక్కడ ఇంట్లోనే ఉంటే వాడికి వెసులుబాటుగా ఉంటుంది."

"మరి మాతో ఎప్పుడుంటావమ్మా?"

"వస్తాన్రా!.... ఇక్కడ కొంతకాలం ఉంటాన్రా!"

"ఎప్పుడమ్మా?"

"ఆ సంగతి ముందు అమ్మాయి చెప్పాలి."

"మధ్యలో శ్యామల చెప్పడం ఏమిటి?"

"నీకు తెలియదులే... ఏం తల్లీ.... నువ్వు పురిటికి పుట్టింటికి వెళ్లబోయేముందు ఉత్తరం రాయించు. రెక్కలు కట్టుకుని వాల్తాను. అప్పుడొస్తాను. ఆ తర్వాత భగవంతుడు నాకు అదృష్టం ఇస్తే ఇక్కడ మనవడితోనో, మనవరాలితోనో ఆడుకునేందుకు మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటాను!"

తల్లి ఆనందపారవశ్యంతో నవ్వులు కుమ్మరించింది.

"అమ్మా! నువ్వు నిజంగా ఆదర్శమూర్తివమ్మా!"

"అత్తయ్యా! మీలో నిజంగా దేవతని చూస్తున్నాను."

వారి గుండెచప్పుళ్లు నవ్వులతో శ్రుతి కలిపాయి.

*('ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక' - 2 డిసెంబరు, 2000)*